క్లుప్తంగా

కొనసాగుతున్న సత్కారాలు



ఎమ్మెల్యే గాంధీని సత్కరిస్తున్న గోకుల్‌ఫ్లాట్స్‌వాసులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆరెకపూడి గాంధీని ప్రకటించినప్పటి నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ రంగాల వారి సత్కారాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మాదాపూర్ డివిజన్ గోకుల్‌ఫ్లాట్స్, కొండాపూర్ డివిజన్ మార్తాండనగర్‌కు చెందినవారు భారీ గజమాలతో గాంధీని సత్కరించి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరూ సమష్టిగా కృషి చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి గెలిపించి తమ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం



ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టానున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ తెలిపారు. సోమవారం రూ.4 కోట్లతో చేపట్టే బాక్స్ కల్వర్ట్, వరదనీటి కాలువల నిర్మాణ పనులకు కార్పొరేటర్లు మంజులారఘునాథ్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు.

సబ్బండ వర్గాలకు అండగా ఉంటా



పటాన్‌చెరు టౌన్: ప్రజాసేవే లక్ష్యంగా సబ్బండ వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని ఎస్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ కిర్బికాలనీలో ఆదివారం నిర్వహించిన మైసమ్మ, పోచమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల మద్దతుతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థుల కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో ముదిరాజులు 60లక్షల మంది ఉండగా ఏ ఒక్కచోటా సీటు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అన్నివర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు సాగుతానని తెలిపారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు మురళీ, రాజ్‌కుమార్, వెంకటేశ్, అశోక్, ప్రవీణ్, రాములు, బాల్‌రాజ్, జనార్దన్, వెంకటేశ్వరరావు, కాలనీ వాసులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

నీలం మధుకు మద్దతు

జిన్నారం(పటాన్‌చెరు): ముదిరాజ్ నేత నీలం మధుకు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని, ఈ విషయంలో నీలం మధుతోనే ఉంటామని జిన్నారం గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం జిన్నారంలో ముదిరాజ్‌భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధుకు అండగా ఉండాలని ముదిరాజ్ సంఘం నాయకులు తీర్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కులపెద్దలు పాల్గొన్నారు.

నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదని తెలిపారు.

విప్రో సర్కిల్‌లో ఫ్లైఓవర్‌కు ప్రతిపాదనలు



నానక్‌రాంగూడ ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని విప్రో సర్కిల్

- పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా తప్పనిసరి నిర్మాణం
- 'ప్లస్' ఆకారంలో నిర్మాణం
- ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలకు చెక్

రాయదుర్గం: నానక్‌రాంగూడ ప్రాంతంలో ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో విప్రో సర్కిల్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ కూడలి ద్వారానే ఇటు నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి ప్రాంతాలకే కాకుండా ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు వెళ్లేందుకు కూడా అవకాశం ఉండడంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఎప్పుడూ వాహనాల రద్దీ పెరుగుతూనే ఉంటుంది. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టడానికి ఫ్లైఓవర్ నిర్మాణం అత్యవసరం. దీన్ని గుర్తించి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ఈ ఫ్లైఓవర్ నిర్మాణంపై ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేసినట్లు అసెంబ్లీలోనే ప్రకటించారు. దీంతో దీనికి ప్రాధాన్యత పెరిగింది. రోజూ వేలాది వాహనాలు నగరం నుంచి ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి, నానక్‌రాంగూడ, ఔటర్ రింగురోడ్డు నుంచి, గౌలిదొడ్డి నుంచి నార్సింగి నుంచి కూడా వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా ఇక్కడి నుంచి కూడా అదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా సాఫీగా రాకపోకలు సాగించేందుకు ఫ్లైఓవర్ నిర్మాణం అత్యవసరమని అధికారులు గుర్తించారు.

మొదట్లో 'ఫోర్ వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి'..

విప్రో సర్కిల్‌లో ఏపీఐఐసీ పేరుతో ఉన్న సంస్థ కొనసాగినప్పుడు విప్రో సర్కిల్‌లో 'ఫోర్ వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడంతో ఈ ప్రతిపాదన అంతకే పరిమితమై పోయింది. ఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేస్తే కేవలం పాదచారులకు ఈ సర్కిల్‌లో లాభం చేకూరుతుంది. కానీ వాహనాల రాకపోకలకు ఎలాంటి సమస్యలు తగ్గవు. దీంతోనే అప్పట్లో దీని ప్రతిపాదనను ప్రతిపాదనలకే పరిమితం చేశారు. ఇక ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం, టీఎస్ఐఐసీ సంస్థగా ఏపీఐఐసీ రూపాంతరం చెందడంతో ఇక ఇది శాశ్వతంగా మానుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎమ్మెల్యే ప్రకటనతో ప్రాధాన్యం..

విప్రో సర్కిల్‌లో తాజాగా ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని ప్రతిపాదించినట్లు ప్రభుత్వం దృష్టికి రెండు రోజుల క్రితం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ ఫ్లైఓవర్‌కు నిధులు మంజూరు అయితే ఇక ట్రాఫిక్ సమస్యల చాలా వరకు దూరమయ్యే అవకాశం లేకపోలేదు. ఇటీవల అమెరికన్ కాన్సులేట్ కూడా అందుబాటులోకి రావడం, భారీ సంస్థలు కార్యకలాపాలు ఆరంభించడంతో ఉద్యోగులు సంఖ్య భవిష్యత్‌లో మరింత గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. దీంతో ఈ సర్కిల్‌లో ఫ్లైఓవర్ నిర్మాణంతో ఇక ట్రాఫిక్ సిగ్నల్ సమస్య కూడా దూరమయ్యే అవకాశం కూడా ఉంది. ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ వరకున్న రోడ్డులో మైక్రోసాఫ్ట్ సంస్థ ముందునుంచి విప్రో సర్కిల్ వరకున్న రోడ్డు కాస్తా స్లోప్‌గా ఉంది. దీంతో అక్కడ వాహనాల వేగం అదుపు చేయడం కష్టంగా మారింది.దీంతో పలు మార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ నిర్మాణం చేస్తే ప్రమాదాలు పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఆకట్టుకున్న ఈఎంయూఎన్ ఎడిషన్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రముఖులు

శేరిలింగంపల్లి: విద్యార్థుల ఎపిస్టెమో మోడల్ యునైటెడ్ నూషన్స్ (ఈఎంయూఎన్) నాలుగవ ఎడిషన్ కార్యక్రమం ఆకట్టుకుంది.నల్లగండ్లలోని ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమాన్ని పర్యావరణ వేత్త, స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ ఐశ్వర్యబుగ్గన చేతుల మీదుగా ప్రారంభించారు. యునైటెడ్ నేషన్ హ్యూమన్ రైట్ కౌన్సిల్, యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆఫ్ డ్రగ్స్ అండ్ క్రైమ్, నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా కమిటీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాయింట్ క్రైసిస్ కమిటీ, ఇంటర్నేషనల్ ప్రెస్ వంటి కమిటీలను విద్యార్థులు వేసుకొని పలు అంశాలపై లోతైన చర్చలు జరిపారు. ముఖ్యంగా పలు దేశాల సరిహద్దు నేరా సమస్యలు, జాత్యాహంకారం, జాతి వివక్ష, జెనోఫిబియా, సంబంధిత అసహనాన్ని ఎదుర్కోవడం వంటి అంశాలపై చర్చించారు. మూడ్రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో మొదటిరోజు ప్రసంగాలు, రెండవ రోజు నృత్య, లైవ్‌మ్యూజిక్‌తో విద్యార్థులు ప్రతిభచాటారు. మూడవ రోజైన ఆదివారం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, వైస్ ప్రిన్సిపల్ పద్మకొల్లి, వాణిమత్రి, పలువురు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్‌తో మానవ సంబంధాలు కనుమరుగు

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



యువభారతి సాహితి సంస్కృతి సంస్థ వజ్రోత్సవాల్లో పాల్గొన్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మోతీనగర్: ఆధునిక సమాజంలో మితిమీరిన టీవీ, స్మార్ట్‌ఫోన్ సంస్కృతితో మానవ సంబంధాలు రోజురోజుకూ కనుమరుగవుతున్నాయని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకర మఠం ఆవరణలో శాంత వసంత ట్రస్టు యువభారతి సాహితి సంస్కృతి సంస్థ వజ్రోత్సవాల సందర్భంగా సాహితీ ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మానవ మూలాలు మరుగున పడే ప్రమాదం గోచరిస్తుందన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యంగా ఈనాటి యువతకు శ్రీరామచంద్రుని మహోన్నత వ్యక్తిత్వంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువభారతి చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఫణీంద్ర, కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు, కోశాధికారి రవీంద్ర, వ్యవస్థాపక సమావేశకర్త వంగపల్లి విశ్వనాథం, సమావేశకర్త పత్రి అశ్విని కుమార్, వజ్రోత్సవ సమన్వయకర్త నాగేశ్వరరావు, శంకరమఠం పరిపాలనాధికారి సీఎస్‌ఆర్ మూర్తి పాల్గొన్నారు.

డోయన్స్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

శేరిలింగంపల్లి: అపోలో హాస్పిటల్స్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలితో అనేక వ్యాధులకు గురవుతున్నారని, చిన్నపాటి జాగ్రత్తలు వహిస్తే ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. నిత్యం వ్యాయామం, వాకింగ్, యోగా చేస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తాజా పండ్లు, ఆకుకూరలు, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు తీసుకోవాలన్నారు. శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పృథ్వీ గణేష్, విశ్వనాథ్, యూసుఫ్, లింగారెడ్డి, ఐఎస్ రామిరెడ్డి, అనంతకుమార్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విష్ణు ప్రసాద్, శివరామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భిక్షపతియాదవ్

'బీజేపీ విజయం ఖాయం'

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ ధీమా వ్యక్తం చేశారు. 83వ రోజు గడపగడపకూ బీజేపీ రవన్న ప్రజాయాత్ర కార్యక్రమాన్ని చందానగర్ డివిజన్‌లోని శంకర్‌నగర్‌లో ఆదివారం ఆయన రవికుమార్‌యాదవ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ గెలుపును శేరిలింగంపల్లిలో ఎవరూ ఆపలేరని గతంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రస్తుత ప్రజాప్రతినిధులు దాచుకోవడం, దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరావు, నవతారెడ్డి, బుచ్చిరెడ్డి, చందర్‌యాదవ్, ఎస్‌ఎస్‌రావు, ఉమామహేశ్వరరావు, ఎల్‌పిరావు, అర్జున్, మల్లేష్‌గౌడ రవీందర్‌రెడ్డి, శివ, పూర్ణయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణ, రంగయ్య, అశోక్ పాల్గొన్నారు.

అట్టడుగు స్థాయిలో శేరిలింగంపల్లి అభివృద్ధి

ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యలపై పాదయాత్రలో భాగంగా 65వ రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గ వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణనగర్, ఆర్‌పీనగర్‌లలో శేరిలింగంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యోగానంద్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలలోని సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. రామకృష్ణనగర్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని.. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు.

- రాష్ట్రంలోనే అధిక పన్నులు చెల్లిస్తున్న శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి అట్టడుగు స్థాయిలో ఉందని విమర్శించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళితబంధు, దళితులకు మూడు ఎకరాల భూమి, వృద్ధులకు పెన్షన్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి వంటి ఎన్నో అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ఏ పథకాలను సక్రమంగా అందజేయలేదన్నారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీని ప్రజలు అధికారంలోకి తీసుకువస్తారని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు విద్యాకల్పన, ఏకాంత్‌గౌడ్, మనోజ్, అశోక్, భాస్కర్‌రెడ్డి, ముత్యాలు, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర దేవస్థానం, జేపీ కాలనీలోని ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్యనగర్ కాలనీలోని మహాదేవుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయాల అర్చకులు తెలిపారు. శ్రావణమాసం నేపథ్యంలో సోమవారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా రామలింగేశ్వర దేవస్థానంలో అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ అర్చకులు మహేష్ తెలిపారు.

బసవేశ్వరుడి జీవితం ఆదర్శం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: బసవేశ్వరుడి జీవితం ఆదర్శనీయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పట్టణంలోని ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయం వరకు చేపట్టిన 16వ మహా పాదయాత్రను ఆదివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఆయన మాట్లాడుతూ 12వ శతాబ్దంలో అభ్యుదయ సమాజం కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడని, ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, టీఎస్ టీపీఎస్ చైర్మన్ మఠం భిక్షపతి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు బసవేశ్వర్, వీరశైవ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్కారం



టీటీడీ బోర్డు సభ్యురాలిగా నియామకమైన ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీతారంజిత్‌రెడ్డిని ఆదివారం ఎమ్మెల్యేలు గాంధీ, కాలేయాదయ్య కలిసి రంజిత్‌రెడ్డి దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు

-గచ్చిబౌలి

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న రజనీకాంత్‌రెడ్డి

గచ్చిబౌలి/రాయదుర్గం: ఓటర్ల జాబితా ప్రత్యేక క్యాంపేయిన్ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగింది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలు, జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక క్యాంపేయిన్ శని, ఆదివారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫామ్–6, 8లను అందుబాటులో ఉంచారు.

నానక్‌రాంగూడ, ఖాజాగూడలో..

గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడ ప్రభుత్వ పాఠశాల, ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లు వచ్చి వారు అడుగుతున్న తీరు, అధికారులు ఇచ్చిన సమాధానాలను వారు స్వయంగా పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు.

- శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపేయిన్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 2,3వ తేదీల్లోనూ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

దుష్ప్రచారాలను ఎండగట్టండి

- సోషల్ మీడియా వేదికల్లో ప్రభుత్వ ప్రగతిని వివరించండి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో.. బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన, తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ పాటిమీది జగన్‌మోహన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫోన్ వినియోగం పెరిగిన ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ కార్యక్రమం సామాజిక మాధ్యమం ద్వారా ప్రజలకు తక్కువ సమయంలో సమాచారం అందిస్తున్నామన్నారు. అవాస్తవాలను దీని ద్వారానే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు వాడుతున్నారన్నారు. ఇందుకనుగుణంగా పార్టీ సోషల్ మీడియా విభాగం పని చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికలలో ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించబోతున్నదన్నారు. టీఎస్టీఎస్ చైర్మన్ జగన్ మోహన్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పారన్నారు. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా ఖాతాలు యాక్టివేట్ చేసుకొని, నియోజకవర్గంలో చేపడుతున్న పనులను గడపగడపకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. భారీ మెజారిటీతో మహిపాల్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



బాపూనగర్‌లోని పోచమ్మ ఆలయంలో..

బోనం.. వైభవం

రాయదుర్గం: గోపన్‌పల్లిలో ఆదివారం నిర్వహించిన శ్రావణమాస బోనాలతో చిత్తారమ్మ ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి అమ్మవారిని భక్తులకు దర్శనం చేసుకొనే అవకాశం కల్పించారు. గోపన్‌పల్లి పరిసరాల్లోని భక్తులు భారీ సంఖ్యల్లో బోనాలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయమే ఆలయాన్ని వివిధ రకాల పూలు, మామిడి, వేప ఆకులు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గోపన్‌పల్లిలోని చిత్తారమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా అమ్మవారిని శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, స్థానికులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానికులు శాలువాలతో సత్కరించారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల ఉత్సవాలు శేరిలింగంపల్లిలో ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రావణ మాస బోనాల మహోత్సవాలు లింగంపల్లి వాసులు భక్తి ప్రపత్తులతో నిర్వహించి అమ్మవారికి బోనాలను సమర్పించారు. బాపూనగర్ శ్రీ పోచమ్మ ఆలయంలో బోనాలతో మహిళలు పోటెత్తారు. పోతరాజుల విన్యాసాలు, డప్పుల తీన్‌మార్‌కు యువకుల నృత్యాలతో గోపీనగర్, బాపూనగర్‌లలో బోనాల పండుగ వాతావరణం నెలకొంది. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

లింగంపల్లిలో...

లింగంపల్లిలో జరిగిన బోనాల వేడుకల్లో శేరిలింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శ్రావణ మాస బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. బోనాల ఉత్సవాల్లో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు గడ్డం రవియాదవ్, ప్రతినిధులు దేవులపల్లి శ్రీనివాస్, కిషోర్‌యాదవ్, సాయికిరణ్‌యాదవ్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.



గోపన్‌పల్లిలోని చిత్తారమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు



భిక్షపతియాదవ్‌ను సత్కరించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి